# క్యాబేజి

దీనిని కూరగా మరియు సలాదుగా కూడా ఉపయోగిస్తారు.

**వాతావరణం :** క్యాబేజికి చల్లని తేమగల వాతవరణం అత్యంత అవసరం. పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత $30^0$ సెల్సియస్ మించకుండా ఉంటే ఎక్కువ దిగుబడినిస్తుంది. రబీలో బాగా పెరుగుతుంది.

**నేలలు :** చౌడు, క్షార నేలలు పనికిరావు. ఇసుకతో గూడిన బంకనేలలు రబీలో ముందుగా వేసే పంటలకు అనుకూలం. సారవంతమైన గుల్ల, ఒండ్రు నేలలు అధిక దిగుబడినిస్తాయి. పి.హెచ్. 5.5 నుండి 6.5 గల నేలలు మిక్కిలి అనుకూలం.

**విత్తనం, విత్తనశుద్ధి, విత్తనమోతాదు :** ఒక ఎకరా విత్తు కోవడానికి సూటి రకాలకు 300 గ్రా. మరియు హైబ్రిడ్స్‌కు 100-150 గ్రా.ల విత్తనం సరిపోతుంది. కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్‌ను కలిపి విత్తనశుద్ధి చేయాలి.

రకాలు

**గోల్డెన్ ఎకర్ :** దీనిగడ్డ గట్టిగా గుండ్రంగా, 1.0 నుండి 1.5 కిలో బరువు వుండి ఋతువులో ముందుగా వేయుటకు అనుకూలమైనది. గడ్డ పగులుట నివారించడానికి కోతకు సిద్ధమైన వెంటనే కోసుకోవాలి. 60 నుండి 65 రోజులలో కోతకు వస్తుంది. మొక్కలు గుబురుగా ఉండి, చిన్నగా ఉంటాయి. కాండం పొట్టిగా ఉండి కొన్ని ఆకులను కలిగి ఉంటుంది. ఈ ఆకులు దొప్ప ఆకారంలో ఉంటాయి.

**ఎర్లీ డ్రమ్ హెడ్ :** గడ్డ చదునుగా పెద్దదిగా ఉంటుంది. 60 నుడి 70 రోజులలో త్వరగా కోతకు వచ్చే రకం.

**ప్రైడ్ ఆఫ్ ఇండియా :** గడ్డలు గుండ్రంగా ఉండి 1.5 నుండి 2.0 కిలోల బరువుంటాయి. 60-80 రోజులలో కోతకు వస్తాయి. ఇది త్వరగా వచ్చే రకం.

**హరిరాణిగోల్ మరియు గణేశ్ గోల్ :** ఇవి ఎఫ్ 1 హైబ్రిడ్ రకాలు. గడ్డ గట్టిగా ఉండి 85-90 రోజుల్లో తయారవుతుంది. ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.

**లేట్ డ్రమ్‌హెడ్ :** గడ్డలు పెద్దగా గుండ్రంగా వుంటాయి. 100-120 రోజులలో కోతకు వస్తాయి. దీర్ఘకాలిక రకం.

**పూస డ్రమ్‌హెడ్ :** గడ్డ గట్టిగా చదునుగా ఉంటుంది. మధ్యకాలిక రకం, నల్లకుళ్ళు తెగులును తట్టుకొంటుంది.

**పూనముక్త (సెలక్షన్-8) :** గడ్డలు గట్టిగా చదునుగా ఉంటుంది. ఒక్కో గడ్డ 1.5-2 కిలోల బరువు ఉంటుంది. బాక్టీరియా నల్లకుళ్ళు తెగులును తట్టుకుంటుంది. నల్లకుళ్ళు తెగులు సమస్య ఉన్న ప్రాంతాల్లో నాటుకోవటానికి అనువైనది.

**హైబ్రిడ్స్ :** బి.యస్.యస్.-50 మరియు బి.యస్.యస్.-126, మహికో మరియు ఇండోఅమెరికన్, నామ్‌ధారి హైబ్రిడ్ రకాలు. (నాథ్ లక్ష్మి-401, గ్రీన్ ఎక్స్‌ప్రెస్, సోనా, శ్వేత, అవంతి, గ్రీన్ ఛాలెంజర్, గ్రీన్‌బోయ్).

**నాటుకునే కాలం :** స్వల్ప కాలపు రకాలకు ఆగష్టు రెండవ పక్షం నుండి సెప్టెంబరు చివరి వరకు, దీర్ఘకాలపు రకాలకు అక్టోబర్ మొదటి పక్షం నుండి నవంబరు చివరి వరకు నాటుకోవచ్చు.

**నారుమడి :** నేల అదునుకు వచ్చే వరకు 4-5 సార్లు బాగా దున్నాలి. 100 చ.మీ. విస్తీర్ణంలో 25-30 గంపల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. 10-15 సెం.మీ. ఎత్తు, 4 మీ. పొడవు మరియు 1 మీ. వెడల్పుతో నారుమళ్ళు తయారు చేయాలి. విత్తనాలను సన్నని ఇసుకతో గాని లేక కంపోస్టుతోగాని కలిపి నారుమడిలోని వరుసల్లో పలుచగా వేయాలి. విత్తిన మడిని ఎండు ఆకులుతో కప్పాలి. విత్తనాలు మొలిచే వరకు (షుమారు వారం రోజుల వరకు) ప్రతి రోజు నీటిని పోయాలి. మొక్కలు మొలకెత్తిన తర్వాత ఎండిన ఆకులను తీసివేయాలి. నారుకుళ్ళ

తెగులు సోకకుండా లీటరునీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌తో నేలను తడపాలి. నారుమడిని ఆకుతినే పురుగు బారి నుండి రక్షించేందుకు 2.5 మి.లీ. మలాథియాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**నాటటం :** నేలను అదును వచ్చేవరకు బాగా దున్నాలి. షుమారు 10-15 రోజుల ముందు నేలను సిద్ధం చేసుకోవాలి. దీర్ఘకాలిక రకాలకు 60×45 సెం.మీ., స్వల్పకాలిక రకాలకు 45×45 సెం.మీ. దూరాన్ని ఉంచాలి. 25-30 రోజుల వయస్సుగల నారును జాగ్రత్తగా నాటుకోవాలి. నాటే ముందు తడిని ఇవ్వాలి.

**నీటియాజమాన్యం :** తేలిక నేలల్లో వారం రోజులకు ఒకసారి, బరువైన నేలల్లో 10 రోజులకు ఒకసారి (5-6 సెం.మీ.) నీటి తడిని ఇవ్వాలి.

**ఎరువులు :** తొలి దఫాగా ఎకరాకు 8-10 టన్నుల పశువుల ఎరువుతో బాటు 32-40 కిలోల భాస్వరం, 40 కిలోల పొటాష్ ఎరువులను చివరి దుక్కిలో వేసి బాగా కలియదున్నాలి. 24-32 కిలోల నత్రజనిని 3 దఫాలుగా నాటిన 25-30 రోజులకు మొదటిసారి, 50-60 రోజులకు రెండవసారి, దీర్ఘకాలిక రకాలయితే 75-80 రోజులకు మూడవసారి వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీటిని ఇవ్వాలి.

**కలుపు నివారణ, అంతరకృషి :** పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.25 లీ. లేదా అలాక్లోర్ 1.0 లీ. (తేలిక నేలలు), 1.2 లీ. (బరువు నేలలు) చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి నాటిన 24-48 గంటల లోపు పిచికారీ చేయాలి. నాటిన 20-25 రోజులప్పుడు అంతరకృషి చేయాలి.

**సస్యరక్షణ**

**క్యాబేజి రెక్కల పురుగు :** ఈ పురుగు ఆకుల అడుగు భాగానవుండి, ఆకులను తిని నాశనం చేస్తుంది. పురుగులు ఆశించిన ఆకులు వాడి, ఎండిపోతాయి. రెక్కల పురుగులు చిన్నవిగా, ఆకుపచ్చ, గోధుమ రంగుల కలయికలో ఉండి, పాలిపోయిన తెలుపు రంగు, సన్నని ముందు రెక్కలు, పొడుగాటి వెంట్రుకలు కలిగిన వెనుక రెక్కలు కలిగి ఉంటాయి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే పైరులో ఆకులన్నీ రంధ్రాలతో ఉండి, క్యాబేజి పరిమాణం చాలా చిన్నదిగా ఉంటుంది. దీని నివారణకు ప్రతి 25 క్యాబేజి వరుసలకు 2 వరుసల చొప్పున ఆవ మొక్కలను ఎర పంటగా వేయాలి. గుడ్లను నాశనం చేసేందుకు వేపగింజల ద్రావణాన్ని (5%) పిచికారి చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి ఎండోసల్ఫాన్ 2 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. కలిపి కోతకు 15 రోజుల వ్యవధి ఉంటే పిచికారి చేయాలి. నాటిన తరువాత 30, 45 రోజుల్లో బిటి మందులు 1 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**పేనుబంక :** ఆకుల అడుగుభాగాన గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగచేస్తాయి. మలాథియాన్ లేదా డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**నారుకుళ్ళు తెగులు :** నారు మొక్కల కాండపు మొదళ్ళు మెత్తగా తయారయి, కుళ్ళి, వడలిపోయి చనిపోతాయి. దీని నివారణకు ఎత్తైన మడులపై నారును పెంచాలి. విత్తనం పలుచగా వరుసల్లో వేయాలి. ఎక్కువ నీటి తడులను ఇవ్వరాదు. నారు మొలచిన తర్వాత కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారి చేయాలి.

**నల్లకుళ్ళు తెగులు :** ఈ తెగులు పంట ఏ దశలో అయినా ఆశించవచ్చు. ఆకులు పత్రహరితాన్ని కోల్పోయి వి (V) ఆకారంలో ఉన్న మచ్చలు ఏర్పడతాయి. ఈనెలు నల్లగా మారుతాయి. స్ట్రెప్టోసైక్లిన్ (1 గ్రా./10 లీటర్ల నీటికి) మందుతో విత్తనశుద్ధి చేయాలి. ఇదే మందును (50 మి.గ్రా. ఒక లీటరు నీటికి) నారు నాటినపుడు, గడ్డ తయారవుతున్నపుడు పైరుపై పిచికారి చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ (3 గ్రా. ఒక లీటరు నీటికి) మందు ద్రావణంతో మొక్కల మొదళ్ళ చుట్టూ తడపాలి. ఎకరాకు 5 కిలోల బ్లీచింగ్ పౌడర్‌ను భూమిలో వేయాలి. ఏదైనా నూనెగింజల పంటతో 2 సం॥ల పాటు పంట మార్పిడి చేయాలి.

**కోత కోయటం :** తగిన పరిమాణం వరకు ఎదిగిన తర్వాత కోయాలి. గట్టిగా, లేతగా వున్న గడ్డలను కోసుకోవాలి.

**దిగుబడి :** ఎకరాకు 14,000-16,000 కిలోల దిగుబడి వస్తుంది.

**సమగ్ర సస్యరక్షణ :** ఎండాకాలంలో బాగా లోతుగా దున్నాలి. పంట అయిపోయిన తరువాత మిగిలిన అవశేష భాగాలను కోసి నాశనం చేయాలి. ఎరపంటగా ఆవపంటను ప్రతి 25 వరుసలకు రెండు వరుసల చొప్పున వేసుకోవాలి. ఎకరాకు 20 చొప్పున పక్షిస్థావరాలను ఏర్పాటు చేయాలి. విత్తేముందు 100 గ్రా. విత్తనానికి 2 గ్రా. చొప్పున ట్రైకోడెర్మా కలిపి విత్తుకోవాలి. ఎకరాకు 20,000 బదనికలను విడుదల చేయాలి. 1 గ్రా. బి.టి. మందు లీటరు నీటికి చొప్పున కలిపి నారుమడిలో 15 రోజులకు ఒకసారి మరియు నాటిన తర్వాత రెండుసార్లు 15 రోజుల వ్యవధితో 30 మరియు 45వ రోజున పిచికారి చేయాలి. 5% వేపగింజల ద్రావణాన్ని మొదటి 30-45 రోజులలో మాత్రమే పిచికారి చేయాలి. విత్తేముందు కార్బండైజిమ్ 1 గ్రా. లేదా కాప్టాన్ 2 గ్రా. కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలి. మాంకోజెబ్ 3 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసి క్యాబేజీలో కుళ్ళు తెగులు తగ్గించుకోవాలి. 2 గ్రా. బెవేరియా బాసియానా లీటరు నీటికి చొప్పున కలిపి 20 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి.

క్యాబేజి సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా **251వ** పేజీలో ఇవ్వబడింది.